5 నుంచి రాజ్యాంగ పరిరక్షణ సదస్సులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఏప్రిల్ నెలను మహనీయుల మాసంగా ప్రకటించుకొని సామాజిక సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 5 నుంచి 14వ తేదీ వరకు రాజ్యాంగ హక్కులను పరిరక్షించుకుందాం, మనువాదాన్ని మట్టుపెడదాం అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక సదస్సులు నిర్వహించనున్నట్లు టీపీఎస్‌కే రాష్ట్ర కన్వీనర్ జి.రాములు తెలిపారు. సోమవారం చిక్కడపల్లిలోని కేవీపీఎస్ రాష్ట్ర కార్యాలయంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ... పదేళ్ల బీజేపీ పాలనలో రాజ్యాంగం రద్దుకు కుట్రలు చేశారే తప్ప దళితులు, గిరిజనులు, బలహీన, మైనార్టీల వర్గాలకు ఎలాంటి మేలు చేయలేదన్నారు. బీజేపీ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులు అభద్రతతో జీవిస్తున్నారని విమర్శించారు. కేవీపీఎస్ అధ్యక్షుడు జాన్‌వెస్లీ, ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు, గిరిజన సంఘం కార్యదర్శి ఆర్.శ్రీరామ్‌నాయక్, కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు ఎం.వి.రమణ, ఆవాజ్ కార్యదర్శి ఎం.డి.అబ్బాస్, మత్స్యకార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి లెల్లెల్ల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో దరఖాస్తులకు ఆహ్వానం

కాచిగూడ: సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్‌లైన్‌లో శిక్షణ కోసం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఇండియా డైరెక్టర్ విమలారెడ్డి తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ డిప్లొమా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. వివరాలకు సెల్: 7893141797 లేదా వెబ్‌సైట్: www.nacrindia.orf లో సంప్రదించాలని కోరారు.

బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి గెలుపునకు ప్రణాళికలు

ముషీరాబాద్: బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం అభ్యర్థి జి.కిషన్‌రెడ్డిని మరోసారి గెలిపించేందుకు ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ నాయకులు సోమవారం అంతర్గత సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. పార్టీ నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రాం, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూస రాజు, ఆరు డివిజన్ల అధ్యక్షులు, రాష్ట్ర, నగర, సీనియర్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళ, బుధవారం నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో కో ఆర్డినేటర్ల సమావేశాన్ని నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. 3వ తేదీ కిషన్‌రెడ్డి ముషీరాబాద్‌లో పర్యటించి పార్టీ నాయకులను కలవడం, ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకునే విధంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 6వ తేదీన బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని వాడవాడల పార్టీ జెండాల ఆవిష్కరణ, సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్ణయించారు. ప్రతి పోలింగ్ బూత్ కన్వీనర్‌లు టిఫిన్ బైటక్ పేరుతో ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా నిర్ణయం తీసుకున్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో 24 వేల పైచిలుకు మెజార్టీ ముషీరాబాద్ నుంచే కిషన్‌రెడ్డికి వచ్చిందని, రాబోయే ఎన్నికల్లో ఈ మెజార్టీని పెంచేలా నాయకులు కృషి చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

ముషీరాబాద్ డీఐగా నదీమ్‌హుస్సేన్



ముషీరాబాద్: ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ నూతన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ (డీఐ)గా మహమ్మద్ నదీమ్ హుస్సేన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని జీడిమెట్ల పోలీస్ స్టేషన్ డీఐగా పని చేస్తూ బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన డీఐ వెంకట్‌రెడ్డి స్థానంలో బదిలీ అయిన శివలింగం విధుల్లో చేరకుండానే బదిలీ చేయించుకున్నారు. 15 రోజుల తరువాత మళ్లీ మహమ్మద్ నదీమ్ హుస్సేన్ విధుల్లో చేరారు.

ఆలిండియా గణితశాస్త్ర పోటీల్లో చిన్నారికి 17వ ర్యాంకు



తులసిరెడ్డికి సర్టిఫికెట్, మెమోంటో అందజేస్తున్న గోపాల్‌రెడ్డి

కాచిగూడ: జాతీయ స్థాయి గణితశాస్త్ర పోటీ పరీక్షలలో నారాయణగూడకు చెందిన నాలుగవ తరగతి విద్యార్థిని తులసిరెడ్డి ప్రతిభను చాటి 17వ ర్యాంకును సాధించింది. దీంతో తులసిరెడ్డిని నారాయణ పాఠశాలల జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం బాల పరమేశ్వర్ ఘనంగా సత్కరించి అభినందించారు. సర్టిఫికెట్‌తో పాటు జ్ఞాపికను, బంగారు పతకాన్ని తులసిరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో నారాయణగూడ నారాయణ స్కూల్ ప్రైమరీ జోన్ ఇన్‌చార్జి భవాని, ప్రిన్సిపాల్ హర్‌సీత్ కౌర్, వైస్ ప్రిన్సిపాల్ మోహిఉన్నీసా, తులసిరెడ్డి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



'మండే' ఎండలతో పరేషాన్!

- వడదెబ్బతో పెరుగుతున్న మానసిక వ్యాధులు
- ఓఆర్ఎస్, మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు మేలంటున్న వైద్యులు

నల్లకుంట: వేసవి ప్రారంభంలోనే భానుడి ప్రతాపం తీవ్రంగానే ఉంది. ఇప్పుడే ఎండలు మండుతుంటే మే నెలలో పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళన ప్రజల్లో సర్వత్రా వ్యక్తం అవుతోంది. ఉదయం 9 గంటలకే సుర్రుమంటున్న సూరీడిని చూస్తే బెంబేలెత్తుతున్నారు. అడుగు బయట పెట్టాలంటే ఒకటికి మూడు సార్లు ఆలోచిస్తున్నారు.

- వేసవితో భానుడు నిప్పులు కక్కుతుండటంతో ఆ సెగ తట్టుకోలేక తల (మాడ) మాడిపోతోంది. ఇప్పటికే ఉదయం 10 గంటలు దాటితే ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో వేసవి తాపానికి గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు పేర్కొంటున్నారు. అనారోగ్యంతో పాటు మతిభ్రమణం వంటి మానసిక సమస్య తీవ్రతరమవుతుందని అటున్నారు. దేశంలో గత పదేళ్లలో నిర్వహించిన పలు పరిశోధనల్లో కూడా ఇలాంటి ఆశ్చర్యకర విషయాలు వెలుగు చేశాయి. కేవలం మూడు రోజుల పాటు వేసవి ఉష్ణోగ్రతలకు లోనయ్యే వ్యక్తులు డీహైడ్రేషన్‌కు గురై, దీని ప్రభావం మానసిక సమస్యలపై పడుతున్నట్లు వైద్యులు వెల్లడిస్తున్నారు.

డీహైడ్రేషన్‌కు గురికాకుండా చూసుకోవాలి



ప్రస్తుతం వేసవి తీవ్రత ఎక్కువగా ఉంది. దీని వల్ల డీహైడ్రేషన్‌కు గురై మానసిక సమస్యలకు ఎక్కువగా గురికావాల్సి వస్తుంది. మనిషి ప్రవర్తనల్లో చాలా మార్పులు వస్తాయి. వేసవి తాపానికి గురైన మనిషి ప్రవర్తనలో మార్పు వస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

– డాక్టర్ కె.శంకర్, ఫీవర్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్

లక్షణాలు ఇలా...

- వడదెబ్బతో పాటు మానసిక సమస్యలు వస్తాయి.
- శరీరంలోని హార్మోన్లపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.
- మ్యానియా వంటి మానసిక వ్యాధి వల్ల మనిషి ప్రవర్తనలో ఒక్కసారిగా మార్పు చోటు చేసుకుంటుంది.
- ఒక్కసారిగా హుషారు ఉన్నట్టు కనిపించడం, ఎక్కువగా మాట్లాడటం, పాటలు పాడటం, నృత్యాలు చేయడం వంటి ప్రవర్తన కనిపిస్తుంది.
- శరీరంలో ఎలక్ట్రోలైట్స్ పూర్తిగా తగ్గిపోయి నోటితో పాటు శరీరంలో సోడియం, పొటాషియం చెమట రూపంలో నీళ్లతో కలిసి బయటకు పోతాయి. దీంతో పరాకుగా మాట్లాడటం. పెద్దపెద్ద శబ్దాలు చేయడం, కుటుంబ సభ్యులను గుర్తించలేకపోవడం వంటి సమస్యలు వస్తున్నాయి.

జాగ్రత్తలు తప్పనిసరి...

- వేసవిలో అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు వెళ్లాలి. అలా వెళ్లేటప్పుడు చలువ కళ్లద్దాలు.. తలకు టోపీ ధరించాలి
- శరీరంపై ఎండపడకుండా వదులైన కాటన్ దుస్తులు ధరించాలి.
- పిల్లలు, వృద్ధులు, బాలింతలు, గర్భిణులు ఎండకు బయటకు వెళ్లకపోవడం ఉత్తమం.
- చెమట, మూత్రం రూపంలో ఎప్పటికప్పుడు శరీరం నీటిని కోల్పోతుంది.
- దీనిని దృష్టిలో పెట్టుకుని నీరు క్కువగా తాగాలి. ఉప్పు, చక్కెర కలిపిన నిమ్మరసం, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటి పానీయాలు నిత్యం తీసుకుంటే వేసవి తీవ్రతవల్ల వచ్చే నష్టాలను అధిగమించవచ్చు.
- మానసిక సమస్యలు ఎదురైతే వెంటనే వైద్యులను సంప్రదించి తగిన చికిత్సలు తీసుకోవాలి.

వృద్ధులు, చిన్నారులపై తీవ్ర ప్రభావం...

వాతావరణంలో అధిక ఉష్ణోగ్రతల వల్ల మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న యువకుల్లో కూడా దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. మెదడు చేతన శక్తి కోల్పోయి మతిభ్రమించినట్లు వ్యవహరిస్తారు. హైదరాబాద్ నగరంలోని కొందరు ఇలాంటి సమస్యలతో తమ ఆస్పత్రులకు వస్తున్నట్టు మానసిక వైద్యులు చెబుతున్నారు.

ఫ్రస్టేషన్‌తోనే కిషన్‌రెడ్డిపై కేటీఆర్ విమర్శలు

బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు



డాక్టర్ గౌతంరావు

కాచిగూడ: సొంత పార్టీ నుంచి ఎమ్మెల్యేలు వెళ్లి పోతుంటే దిక్కుతోచని స్థితిలో ఉన్న బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఫ్రస్టేషన్‌కు గురై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు, విమర్శలు చేయడం సిగ్గు చేటని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు విమర్శించారు. సోమవారం బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ఎన్నికల ప్రచారంలో భాగంగా అంబర్‌పేట నియోజకవర్గంలో కేటీఆర్ పర్యటించి కిషన్‌రెడ్డిపై విమర్శలు చేయడం దుర్మార్గమని అన్నారు. ప్రజలు బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పి అధికారంలో నుంచి దించేసినా కేటీఆర్ అహంకార వైఖరి మాత్రం తగ్గడం లేదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కిషన్‌రెడ్డి ఓటమిపై కేటీఆర్ మాట్లాడుతున్నారని.. కేసీఆర్, కవితలు కూడా ఓడిపోయారనే విషయం మర్చిపోవద్దని హితవు పలికారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్‌లో కిషన్‌రెడ్డి విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై విమర్శలు చేస్తే సహించబోమని ఆయన హెచ్చరించారు.

పద్మారావుగౌడ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి



మాట్లాడుతున్న ముఠా జైసింహ

ముషీరాబాద్: సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. సోమవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని రంగానగర్ ఎస్‌బీఐ కాలనీలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి జైసింహ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమష్టి కృషితో పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని కోరారు. మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తూ బీఆర్ఎస్‌కు అండగా నిలిచేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్‌ను వీడి ఇతర పార్టీలో చేరుతున్న నేతలను చూసి అధైర్యపడవద్దని అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలకు అండగా నిలవాలని అన్నారు. భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, బీసీసెల్ డివిజన్ అధ్యక్షుడు ఉమాకాంత్, డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్‌అలీ, డివిజన్ మైనార్టీ కమిటీ అధ్యక్షుడు మగ్బూల్, నాయకులు కృష్ణ, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

టాంకామ్ మాజీ చైర్మన్ కాంగ్రెస్‌లో చేరిక



రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన రంగారెడ్డి

నల్లకుంట: తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నేత, తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టాంకామ్) మాజీ చైర్మన్ బోయపల్లి రంగారెడ్డి సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా రంగారెడ్డికి పార్టీ కండువా కప్పిన రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి నల్లకుంటలో మాట్లాడుతూ ఉద్యమకారులకు పింఛన్‌లు, ఆరోగ్య బీమా వర్తింపచేయాలని సీఎంని కోరానని తెలిపారు. కాంగ్రెస్‌తోనే రాష్ట్ర, దేశాభివృద్ధి సాధ్యమన్నారు.

నల్లా బిల్లు బకాయిల చెల్లింపునకు ఓటీఎస్



డీజీఎం మోహన్‌రాజ్

ముషీరాబాద్: చిలకలగూడ రిజర్వాయర్ పరిధిలోని మూడు సెక్షన్లలో పెండింగ్‌లో ఉన్న నల్లా బిల్లుల చెల్లింపునకు వినియోగదారులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) అవకాశాన్ని కల్పిస్తున్నామని ముషీరాబాద్‌లోని చిలకలగూడ రిజర్వాయర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎం) మోహన్‌రాజ్ తెలిపారు. సోమవారం రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బకాయిల చెల్లింపుకు ఈ నెల 30 వరకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఈ లోపు బకాయిలు చెలిచకుంటే నల్లా పైప్‌లైన్ కట్ చేస్తామని హెచ్చరించారు. సకాలంలో నీటి బిల్లులు చెల్లిస్తే పెండింగ్ బిల్లులపై ఉన్న వడ్డీ, పెనాల్టీలను తొలగిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని మోహన్‌రాజ్ కోరారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



చిక్కడపల్లి మెట్రో స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య

చిక్కడపల్లి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చిక్కడపల్లి పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. సోమవారం చిక్కడపల్లి మెట్రోస్టేషన్ తదితర ప్రాంతాలను ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య నేతృత్వంలో పోలీసులు క్షుణంగా తనిఖీలు చేశారు. అనుమానం వచ్చిన ప్రతి వాహనాన్నీ తనిఖీ చేసిన తర్వాత పంపించి వేస్తున్నారు. తనిఖీలలో ఎస్ఐలు నాగరాజు, కె.శశిపాల్‌రెడ్డి, పి.అభిలాష్, ఎం.కోటేశ్వర్‌రావు, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేటపై కిషన్‌రెడ్డి స్పెషల్ ఫోకస్

- పట్టు ఉన్న చోట మరింత పట్టు సాధించేలా కమలం వ్యూహం
- గత ఎన్నికల్లో భారీ మెజార్టీ ఇచ్చిన అంబర్‌పేట గడ్డ
- ప్రత్యర్థి పార్టీలకు అందనంత దూరంలో కిషన్‌రెడ్డి ప్రచార పర్వం
- పార్టీకి క్యాడరే బలం, బలహీనత



అంబర్‌పేటపై ప్రత్యేక దృష్టి...

అంబర్‌పేట్: బీజేపీకి పట్టు ఉన్న దగ్గర మరింత పట్టు సాధించేందుకు పావులు కదుపుతున్నారు ఆ పార్టీ నేతలు. సికింద్రాబాద్ లోక్‌సభ స్థానాన్ని తిరిగి కైవసం చేసుకునేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. పార్టీ అభ్యర్థి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గెలిచేందుకు రంగంలోకి దిగారు. ఇతర పార్టీలకు అందనంత దూరంలో ప్రచార పర్వంలో దూసుకుపోతున్నారు. పార్టీ అభ్యర్థి అందరి కంటే ముందే ఖరారు కావడంతో గెలుపే లక్ష్యంగా అన్ని రకాలుగా ముందుకు వెళుతున్నారు. గత పదిహేను రోజులుగా కిషన్‌రెడ్డి నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. పార్లమెంటు పరిధిలో ప్రత్యేక ప్రాంతాలపై ఫోకస్ చేసి తిరిగి విజయం సాధించేందుకు ముందుకు వెళుతున్నారు. ఒకవైపు పార్టీ వ్యవహారాలు చక్కదిద్దుకుంటూ ఉదయం, సాయంత్రం తన స్థానాన్ని పదిల పరుచుకునేలా ఎన్నికల బరిలో దిగి తనదైన శైలిలో ప్రచారాన్ని సాగిస్తున్నారు.

సికింద్రాబాద్ పార్లమెంటు పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో కిషన్‌రెడ్డికి అంబర్‌పేట నియోజకవర్గం నుంచే 45 వేల మెజార్టీ రావడంతో ఆయన సునాయసంగా విజయం సాధించారు. తాజాగా అంబర్‌పేటపై ఆయన మరింత ఫోకస్ చేస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు 2.80 లక్షల ఓట్లు ఉన్నాయి. దీంట్లో లక్షన్నరపైగా ఓట్లు బీజేపీకి పడేలా కిషన్‌రెడ్డి వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. అంబర్‌పేట నుంచి గతంలో కంటే ఎక్కువ మెజార్టీ తెచ్చుకుంటే ఇతర నియోజకవర్గాల్లో తగ్గిన గెలుపు ఖాయమని భావిస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అంబర్‌పేట్‌లో పార్టీకి ఉన్న 50 వేల ఓటు బ్యాంకు పదిలంగా ఉన్నా మరో లక్ష ఓట్లు లక్ష్యంగా బీజేపీ పదవులు కదుపుతున్నారు.



ఇతర పార్టీలు మేలుకునే లోపే...

సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో బీజేపీ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని పలువురు భావిస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎన్నికలకు సిద్ధపడేలోపు బీజేపీ ప్రచారంలో వారికి అందనంతా దూరంలో ఉండాలని భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై గందరగోళ పరిస్థితి ఉండటంపై బీజేపీ తనకు అనుకూలంగా మార్చుకుంటుంది. బీఆర్ఎస్ అధికారంలో లేకపోవడంతో పెద్దగా పోటీ ఇవ్వదని బీజేపీ ధీమా వ్యక్తం చేస్తుంది. సికింద్రాబాద్ పార్లమెంటు ప్రజలు బీజేపీకి అండగా ఉంటారని ధీమాతో ఉన్నారు.

క్యాడర్ సహకరిస్తే గెలుపు సులువే...

బీజేపీకి సికింద్రాబాద్ పార్లమెంటు పరిధిలో క్యాడర్ పటిష్ఠంగా ఉన్నప్పటికి పూర్తి స్థాయిలో పనిచేస్తారా అనే దానిపై అనుమానలు అసెంబ్లీ ఎన్నికల్లో క్యాడర్ పనితీరు బయటపడింది. క్యాడర్ బలంగా ఉన్న పోలింగ్ బూతుల్లో సహితం ఆశించిన స్థాయి ఓట్లు పడలేదు. ఇది పార్టీకి ఆందోళనకరమే. ప్రతి కార్యకర్తకూ కిషన్‌రెడ్డి వ్యక్తిగతంగా సన్నిహితం ఉన్నా పూర్తి స్థాయిలో పనిచేస్తారో లేదో అనుమానమే. పార్టీ కార్యకర్తలు, నాయకులు సిద్ధంత పరంగా ఇతర పార్టీలతో పోలిస్తే కట్టుబడే ఉంటారు. మారిన రాజకీయ పరిస్థితులతో కార్యకర్తలు మారే అవకాశాలు లేకపోలేదు. వారిని కిషన్‌రెడ్డి ఎలా సమన్వయం చేసి విజయం సాధిస్తారో వేచి చూడాల్సిందే.

బీజేపీకి మద్దతు పలకండి: కిషన్‌రెడ్డి



బాలప్పబాడలో ప్రచారం నిర్వహిస్తున్న కిషన్‌రెడ్డి

కాచిగూడ: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్రమోదీ పాలనకు మద్దతుగా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం బీజేపీ అభ్యర్థి, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం కాచిగూడ డివిజన్, బాలప్పబాడలో స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్‌తో కలిసి కలిసి ఆయన ఇంటింటికీ ప్రచారం చేపట్టారు. అంతకు ముందు కిషన్‌రెడ్డి కాచిగూడ లింగంపల్లిలోని శ్రీ రాఘవేంద్ర స్వామి బృందావన సమితిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా కిషన్‌రెడ్డికి స్థానిక మహిళలు అడుగడుగునా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరిగానే ఈసారి కూడా తనకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, కన్నె రమేష్ యాదవ్, కె.గీతామూర్తి, ఎ.సూర్యప్రకాష్ సింగ్, సుభాష్ పటేల్, సి.వినోద్ యాదవ్, శ్యామ్‌రాజ్, హజారిబాబు, శీర్‌సాగర్, కృష్ణకుమార్, అరవింద్, మల్లికార్జున్, బల్వీర్, ఆర్.సంతోష్, భీమ్‌రాజ్, ఎస్.రవి యాదవ్, లావణ్య, తార తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ఇఫ్తార్ ప్రతీక



ఇఫ్తార్‌లో పాల్గొన్న పద్మారావుగౌడ్ తదితరులు

అంబర్‌పేట్: ఇఫ్తార్ విందులు మతసమరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం బాగ్ అంబర్‌పేట డివిజన్ రహత్‌నగర్‌లో బీఆర్ఎస్ నాయకుడు హబీబ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఇఫ్తార్ విందుకు బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంటు అభ్యర్థి పద్మారావుగౌడ్, స్థానిక కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కె.పద్మావతీరెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కె.దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.వెంకట్‌రెడ్డి, నాయకులు జమీర్, చందు, సంతోష్, అప్రోజ్‌పటేల్, దీపిప్ తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడలో...

కాచిగూడ: జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్. గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కాచిగూడలోని అకాడమీలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లింలకు పండ్లు తినిపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మత సామరస్యానికి ఇఫ్తార్ విందులు ప్రతీకగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు.



కాచిగూడ జీవీఆర్ కరాటే అకాడమీలో...

బీసీల మద్దతు కాంగ్రెస్ పార్టీకే..



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

కాచిగూడ: పార్లమెంట్ ఎన్నికల్లో బీసీల మద్దతు కాంగ్రెస్ పార్టీకే ఉంటుందని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. జాతీయ బీసీ దళ్ ఆధ్వర్యంలో సోమవారం కాచిగూడలో జరిగిన బీసీ కుల సంఘాల అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. జనాభా దామాషా ప్రకారం ప్రజలు హక్కులు పొందడం ప్రజాస్వామిక సామాజిక న్యాయమని, అది కులగణనతోనే సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో బీసీ నేతలు మహేంద్రబాబు, వడ్డేమని శ్రీనివాస్, ప్రొఫెసర్ కేశవ్, సాయి యాదవ్, కుల సంఘాల నేతలు, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యా సంస్థల ఆగడాలను అరికట్టాలి

కాచిగూడ: కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల ఆగడాలను అరికట్టడంలో విద్యాశాఖ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని బీసీ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ అన్నారు. సోమవారం కాచిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు విద్యాహక్కు చట్టాన్ని, ఫీజు నియంత్రణ చట్టాన్ని ఉల్లంఘిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతున్నాయన్నారు. లక్షలాది రూపాయలు ఫీజుల పేరుతో వసూలు చేస్తున్నాయని విమర్శించారు. ఫీజులు చెల్లించలేని విద్యార్థులకు టీసీలు ఇస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. ఆయా పాఠశాల, కళాశాలలపై ఫిర్యాదు చేసినా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, దీనిపై ఫిర్యాదులు అందుకున్న విద్యాశాఖ అధికారులు నోటీసులు అందజేసినా ఆయా విద్యా సంస్థలు పెడచెవిన పెడుతున్నాయని అన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

దేశం గర్వించదగ్గ వ్యక్తి పీవీ

పీవీ కుమారుడు, పారిశ్రామికవేత్త పీవీ ప్రభాకర్‌రావు



కార్యక్రమంలో పాల్గొన్న పీవీ ప్రభాకర్‌రావు, తనుగుల జీతేందర్‌రావు

చిక్కడపల్లి: మాజీ ప్రధాని, భారతరత్న డాక్టర్ పి.వి.నరసింహారావు ఓ వ్యక్తి కాదు.. శక్తి అని పీవీ కుమారుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త పి.వి.ప్రభాకర్‌రావు అన్నారు. పీవీ నరసింహారావుకు ప్రకటించిన భారతరత్న పురస్కారాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా అందుకోవడం గొప్పగా ఉందన్నారు. అవార్డు స్వీకరించిన అనంతరం నగరానికి వచ్చిన సందర్భంగా సోమవారం చిక్కడపల్లిలో టీవైజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ పాత్రికేయుడు డాక్టర్ తనుగుల జీతేందర్‌రావు ఆధ్వర్యంలో అభినందన సత్కార కార్యక్రమం జరిగింది. పీవీ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ... తన తండ్రికి దక్కిన దేశ అత్యున్నత గౌరవ పురస్కారాన్ని తను అందుకోవడం తాను పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని అన్నారు. తమ కుటుంబ సభ్యులంతా నేడు ఉన్నతంగా ఉన్నారంటే బాల్యంలో పీవీ బోధనలే కారణమన్నారు. టీవైజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ తనుగుల జీతేందర్‌రావు, పీవీ ప్రభాకర్‌రావు కుమార్తె, జర్నలిస్ట్ దివ్య, ఉమ్మడి మెదక్ జిల్లా టీవైజేఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం



చిక్కడపల్లి: ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ అన్నారు. సోమవారం అరుంధతీనగర్ బస్తీలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్‌తో కలసి పర్యటించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పెండింగ్‌లో ఉన్న షాబాద్ ఫ్లోరింగ్ బండల ఏర్పాటు పనులను తిరిగి ప్రారంభించి వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావని జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌ను ఆదేశించారు. మరికొన్ని ప్రాంతాలలో పెండిగ్‌లో ఉన్న పైప్‌లైన పనులు, షాబాద్ ఫ్లోరింగ్ ఏర్పాటు తదితర పనులను పూర్తి చేస్తామన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ఎం.ఉమేష్, ఆకుల సురేందర్, వడ్డేపల్లి ఆనంద్‌రావు, ప్రశాంత్, సతీష్, అరుంధతీనగర్ బస్తీ సంఘం అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్‌యాదవ్, జి.డి.రాజు, శ్రీనివాస్ గౌడ్, స్థానికులు రాజయ్య, స్వామిగౌడ్, భారతి రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.